

మనం

కడప | అన్నమయ్య

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖాముఖి లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్

5 లో



నందలూరు ఎంపీపీ పీఠంపై జనసేన గురి!

తెరపైకి యల్లటూరు చంద్రకళ పేరు

యల్లటూరు శ్రీనివాసరాజు వ్యూహానికి దక్కనున్న ప్రాధాన్యత?

ఎంపీపీ బరిలో యల్లటూరు చంద్రకళ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న వైనం

ఓసీ మహిళకు రిజర్వు కావడం.. జనసేన బీఫామ్ కూడా ఆమెకే!

మండల పరిషత్ అధ్యక్ష పదవి జనసేన ఖాతాలోకేనా?

కూటమి విజయాలతో ఎంపీపీ పీఠంపై ఆశలు పెంచుకుంటున్న జనసేన శ్రేణులు.

బీఫామ్ కేటాయింపుపై శ్రీనివాసరాజు స్పష్టమైన వ్యాఖ్యలు

మండల పరిషత్ పగ్గాలపై జనసేన శ్రేణుల్లో ఆసక్తి

నందలూరు మండల రాజకీయాల్లో ఎంపీపీ పీఠమే ఇప్పుడు హాట్‌టాపిక్!



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 9

నందలూరు మండల రాజకీయాల్లో జనసేన పార్టీ ఇప్పుడు ఎంపీపీ పీఠంపై ప్రత్యేక దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో మండల పరిషత్ అధ్యక్ష పదవిపై రాజకీయ చర్చ మొదలైంది. ముఖ్యంగా జనసేన పార్టీ తరఫున యల్లటూరు చంద్రకళ పేరు తెరపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంపీపీ పదవి ఓసీ మహిళకు కేటాయించడం, జనసేన తరఫున ఆమెకు బీఫామ్ అందించడం వంటి పరిణామాలు ఈ చర్చకు కేంద్రబిందువుగా మారాయి. దీంతో నందలూరులో జనసేనకు మండల పరిషత్ పగ్గాలు దక్కుతాయా? అన్న ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ఫలితాల్లో టీడీపీ నాలుగు, జనసేన రెండు, బీజేపీ రెండు స్థానాలు సాధించగా, వైసీపీ ఒకటి, స్వతంత్రులు ఒక స్థానంలో విజయం సాధించారు. కూటమి తరఫున జనసేనకు లభించిన స్థానాలతో పాటు పార్టీ నాయకత్వం ఎంపీపీ పదవిపై తీసుకునే నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో జనసేన రాజంపేట పార్లమెంటరీ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పార్టీ తరఫున బీఫామ్ ఇచ్చిన వ్యక్తికే ఎంపీపీ పదవి ఇచ్చే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొనడంతో యల్లటూరు చంద్రకళ పేరు చర్చలో మరింత ప్రముఖంగా వినిపిస్తోంది.

ఎంపీపీ రిజర్వేషన్ జనసేనకు కలిసొచ్చే అంశమా?

నందలూరు ఎంపీపీ పదవి ఓసీ మహిళకు రిజర్వు కావడంతో జనసేన తరఫున యల్లటూరు చంద్రకళకు అవకాశం కల్పించే అంశం చర్చనీయాంశమైంది. ఆమెకు పార్టీ బీఫామ్ కేటాయించిన నేపథ్యంలో అధ్యక్ష పదవిపై జనసేన శ్రేణులు ఆశలు పెట్టుకున్నాయి.

శ్రీనివాసరాజు వ్యాఖ్యలతో ప్రాధాన్యత

జనసేన రాజంపేట పార్లమెంటరీ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. పార్టీ తరఫున బీఫామ్ అందించిన అభ్యర్థికే ఎంపీపీ పదవి ఇచ్చే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొనడం ద్వారా పార్టీ అభ్యర్థిత్వానికి ప్రాధాన్యతను స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ పదవి విషయంలో ఆయన పాత్ర, కూటమి నాయకులతో జరిపే సమన్వయం కీలకంగా మారనున్నాయి.

జనసేనకు దక్కిన రెండు స్థానాలు

ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన రెండు స్థానాలను గెలుచుకుంది. టీడీపీ నాలుగు, బీజేపీ రెండు స్థానాలను సాధించాయి. కూటమి పార్టీల మధ్య పదవుల పంపకం ఎలా ఉండబోతోందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జనసేనకు ఎంపీపీ పదవి కేటాయిస్తారా? అన్న అంశంపై పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది.

చంద్రకళకు అవకాశం దక్కేనా?

బీఫామ్ కేటాయింపు, ఓసీ మహిళ రిజర్వేషన్ నేపథ్యంలో యల్లటూరు చంద్రకళ పేరు ఎంపీపీ పదవికి సంబంధించి ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే తుది నిర్ణయం కూటమి పార్టీల పరస్పర చర్చలు, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఏదేమైనా నందలూరు మండల పరిషత్ అధ్యక్ష పదవి చుట్టూ జనసేన కేంద్రంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది.

నందలూరు ఎంపీపీ పీఠంపై జనసేన గురి!

మండల పరిషత్ అధ్యక్ష పదవి జనసేన ఖాతాలోకేనా?

కూటమి విజయాలతో ఎంపీపీ పీఠంపై ఆశలు పెంచుకుంటున్న జనసేన శ్రేణులు.

యల్లటూరు శ్రీనివాసరాజు వ్యూహానికి దక్కనున్న ప్రాధాన్యత?

ఎంపీపీ బరిలో యల్లటూరు చంద్రకళ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న వైనం.

ఓసీ మహిళకు రిజర్వు కావడం.. జనసేన బీఫామ్ కూడా ఆమెకే!

బీఫామ్ అందుకున్న అభ్యర్థికే అధ్యక్ష పదవి దక్కుతుందన్న యల్లటూరు శ్రీనివాసరాజు వ్యాఖ్యలు ఆసక్తికరం.

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పదవుల సర్దుబాటుపై ఉత్కంఠ.

నందలూరు మండల రాజకీయాల్లో ఎంపీపీ పీఠమే ఇప్పుడు హాట్‌టాపిక్!

పల్లె పోరుకు వేళాయె!


13న తొలి విడత పంచాయతీ నోటిఫికేషన్

జిల్లాలో మూడు విడతల్లో 615 పంచాయతీలకు ఎన్నికలు

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం

గ్రామాల్లో పట్టుకోసం నేతల వ్యూహప్రతివ్యూహాలు

కోర్టు కేసులతో 4 పంచాయతీలకు నిలిచిన పోలింగ్



మనం ప్రతినిధి కడప నవంబర్ 9

వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల సమర శంఖారావం పూరించేందుకు రంగం సిద్ధమైంది. గ్రామాల్లో పాలక వర్గాల కొలువుకు ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. జిల్లావ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ కసరత్తు పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 13న మొదటి విడత ఎన్నికల అధికారిక నోటిఫికేషన్ వెలువడనుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ విభాగం క్షేత్రస్థాయి ఏర్పాట్లను ముమ్మరం చేయడంతో పల్లెసీమల్లో ఎన్నికల సందడి అప్పుడే ఊపందుకుంది.

పల్లెల్లో పైచేయి కోసం ఎత్తులు

పంచాయతీ పోరుకు పార్టీల గుర్తులు ఉండకపోయిన ప్పటికీ, గ్రామస్థాయిలో పట్టు నిలుపుకోవడం అధికార, విపక్షాలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. భవిష్యత్ ఎన్నికల విజయాలకు స్థానిక సంస్థలే పునాది కావడంతో నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు ఇప్పటికే క్షేత్రస్థాయి సమీకరణాలపై దృష్టి సారించారు. తమ వర్గీయులకే సర్పంచి పీఠం దక్కాలన్న పట్టుదలతో పావులు కదుపుతున్నారు. ప్రత్యర్థులను బరిలోంచి తప్పించేందుకు ఏకగ్రీవాల ఎత్తులు, తెరవెనుక రాయబారాలు మొదలయ్యాయి. గతంలో ఎదురైన చేదు అనుభవాలు, ఘర్షణలు, బెదిరింపుల వంటివి పునరావృతం కాకుండా పారదర్శకంగా ఎన్నికలు సాగుతాయా అన్న ఉత్కంఠ ఓటర్లలో నెలకొంది.

మూడు విడతల్లో.. 615 పంచాయతీలు

జిల్లావ్యాప్తంగా మొత్తం 615 గ్రామ పంచాయతీలు, 5,960 వార్డు స్థానాలకు మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 6,136 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.


మొదటి విడత: బద్వేలు డివిజన్‌లోని 9 మండలాలు (మైదుకూరు, బి.మఠం, బద్వేలు, అట్లూరు, బి.కోడూరు, గోపవరం, పోరుమామిళ్ల, ఎస్.ఎ.కాశినాయన, కలసపాడు), రాజంపేట డివిజన్‌లోని 4 మండలాలు (రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి) కలిపి మొత్తం 13 మండలాల్లోని పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ విడత కోసం బద్వేలు డివిజన్‌లో 1,126, రాజంపేట డివిజన్‌లో 618 చొప్పున మొత్తం 1,744 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రెండో విడత: కడప డివిజన్‌లోని 8 మండలాలు, పులివెందుల డివిజన్‌లోని 5 మండలాలు కలిపి మొత్తం 13 మండలాల్లో పోలింగ్ సాగనుంది. కడప డివిజన్‌లో 1,268, పులివెందుల పరిధిలో 756 కలిపి 2,024 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.

మూడో విడత: జమ్మలమడుగు డివిజన్‌లోని 10 మండలాలు, పులివెందుల డివిజన్‌లోని మరో 3 మండలాలు కలిపి 13 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జమ్మలమడుగులో 1,888, పులివెందులలో 480 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది.


నాలుగు పంచాయతీల్లో ఎన్నికల వాయిదా

జిల్లాలో మొత్తం 619 పంచాయతీలు ఉండగా, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసుల కారణంగా నాలుగు పంచాయతీల్లో ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేశారు. కమలాపురం మండలంలోని సి.గోపాల పురం, నందలూరు మండలంలోని నూకినేనిపల్లె, సుండుపల్లె మండలంలోని సుండుపల్లి, ఈడిగపల్లె పంచాయతీల్లో ప్రస్తుతానికి ఎన్నికలు జరగడం లేదని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన 615 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు.



జిల్లాలోనే సరికొత్త రికార్డు సృష్టించిన జడ్పీటీసీ పోలి సుబ్బారెడ్డికి ఆలయంలో ఘన సత్కారం

రాజంపేట, నవంబర్ 9 (మనంన్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజంపేట మండలం నుంచి ప్రభంజనం సృష్టించి, వైఎస్సార్ కడప జిల్లా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధిక రికార్డు మెజారిటీతో తిరుగులేని విజయం సాధించిన రాజంపేట మండల జడ్పీటీసీ పోలి సుబ్బారెడ్డి సోమవారం పట్టణంలోని ఈడిగపాలెం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, శ్రీ బాలసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ స్థానాల్లోనే అత్యంత భారీ మెజారిటీని కైవసం చేసుకుని రికార్డు స్థాయి ఆధిక్యంతో సరికొత్త చరిత్ర లిఖించిన ఘనత దక్కించుకున్న పోలి సుబ్బారెడ్డి రాకతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. జిల్లా టాపర్‌గా నిలిచిన ప్రజానేతను ఆలయ వ్యవస్థాపకులు మలిశెట్టి చంద్రమౌళి ఘనంగా స్వాగతించి, స్వామివారి పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలతో ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం జిల్లాలోనే తిరుగులేని ప్రజాదరణతో రికార్డు మెజారిటీ నమోదు చేసిన జడ్పీటీసీ పోలి సుబ్బారెడ్డిని, మండల అధ్యక్షుడు మేడికొండ రవికుమార్‌ను ఈడిగపాలెం యూత్, స్థానిక నాయకులు దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో అత్యంత వైభవంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకుడు చేరి బాలాజీ మొదలియార్, పోలి యూనిట్ ఇంచార్జ్ కె.వి. రమణ, మిట్టమీదిపల్లి ఎంపీటీసీ పత్తిపాటి రవి, నాగినేని రమణలతో పాటు ఈడిగపాలెంకు చెందిన సుబ్బరాయుడు, చేరి నవీన్ కుమార్, భాగ్యేశ్వర్, ఎం. సాయి కృష్ణ, శివ, హేమంత్, కార్తీక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





హరి నివాస్ కాలనీలో రోడ్లను వాడుకునేందుకు అనుమతించం..

అలాంటి చర్యలు ఎవరు చేపట్టిన ప్రతిఘటించి న్యాయపోరాటం చేస్తాం?

హరినివాస్ వాసుల వెల్లడి

ప్రొద్దుటూరు, నవంబర్ 9 మనంన్యూస్: హరి నివాస్ గేటెడ్ కమ్యూనిటీలో రోడ్లను వాడుకునేందుకు ఎవరికైనా అనుమతించమని ఒకవేళ అలాంటి చర్యలు ఎవరు చేపట్టిన ప్రతిఘటించి న్యాయ పోరాటానికి సిద్ధమని హరినివాస్ కాలనీ వాసులు వెల్లడించారు. ఆదివారం హరి నివాస్ కాలనీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హరి నివాస్ కాలనీ ఏర్పాటుచేసిన యాజమాన్యం అన్ని ప్లాట్లను విక్రయించి గత మూడు సంవత్సరాలుగా కనీసం కాలనీ అభివృద్ధి కూడా పట్టించుకోక వారి స్వలాభం కోసం కాలనీ పక్కన ఉన్న స్థలాలను కొనుగోలు చేసి వాటిని చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. హరినివాస్ లో ఉన్న రోడ్లను తమ నిర్మాణాలకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్న యాజమాన్యాన్ని ప్రతిఘటించిన నేపథ్యంలో తమకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడి ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. హరి నివాస్ వెంచర్‌లో 113 ప్లాట్లు విక్రయించి అందరికీ అప్పగించిన తర్వాత రాకపోకల కోసం తమ నివాస ప్రాంతంలోని దారిని వినియోగించుకోవాలని ప్రయత్నించడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. తమ వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంచర్‌లో భాగంగా నిర్మించిన క్లబ్‌హౌస్ విషయంలోనూ దారి సమస్యను ముడిపెట్టి ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. రైస్ మిల్లుతో పాటు మరో ప్రత్తి మిల్లుకు కూడా ఇదే దారిని ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు కొత్తగా దారి సమస్యను సృష్టించడం సరికాదన్నారు. పలుమార్లు తమ అభ్యంతరాలను తెలియజేసినా పరిష్కారం లభించలేదని, సమస్య పరిష్కారం కాకపోతే న్యాయపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. తమ నివాస ప్రాంతంలో ప్రశాంతమైన రాకపోకలకు ఆటంకం కలగకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో హరి నివాస్ ప్లాట్ల నివాసితులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



ప్రొద్దుటూరు నవంబర్ 9 మనం న్యూస్: కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం ప్రొద్దుటూరు నుండి రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గంగాధర్ వెల్లడించారు ఈ సందర్భంగా ప్రతి సోమవారం పొద్దుటూరు నుండి పొలతల క్షేత్రానికి కన్యతీర్థం క్షేత్రానికి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు.ప్రొద్దుటూరు నుండి కన్యతీర్థములకు ఉదయం 9 గంటలకు కొలతలకు ఉదయం ఏడు గంటలకు బస్సులు బయలుదేరునని తెలిపారు మరియు ప్రతి శని ఆది సోమవారాలలో ఉదయం ఏడున్నర గంటలకు శ్రీశైలం అన్నకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డిపో మేనేజర్ కోరారు.

నందలూరులో కూటమి జోరు

జడ్పీటీసీగా చుక్క నిర్మల జయకేతనం!

ప్రజా తీర్పునకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా: నూతన జడ్పీటీసీ

నాయకులు, కార్యకర్తల ఐక్యతే విజయానికి ఊపిరి

మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 9: నందలూరు జడ్పీటీసీ సమరంలో కూటమి ప్రభంజనం వీచింది. టీడీపీ–జనసేన–బీజేపీ బలపరిచిన అభ్యర్థి చుక్క నిర్మల యానాది ప్రత్యర్థులపై భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించి జయకేతనం ఎగురవేశారు. ఫలితం వెలువడగానే కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగి పోయాయి. ఈ సందర్భంగా నూతన జడ్పీటీసీ నిర్మల మాట్లాడుతూ, ఈ అఖండ విజయం నందలూరు మండల ప్రజల ఆశీర్వాదానికి, కూటమి ఐక్య పోరాటానికి నిదర్శనమని స్పష్టం చేశారు.



నేతల సమన్వయం.. కార్యకర్తల చెమటోడ్పు:

ఎన్నికల నోటిఫికేషన్ నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకు క్షేత్రస్థాయిలో కదం తొక్కిన మూడు పార్టీల క్యాడర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా విజయానికి వెన్నెముకగా నిలిచి వ్యూహాత్మకంగా నడిపించిన కూటమి ముఖ్య నాయకులు ఎలైట్ బాలసుబ్రమణ్యం,జనసేన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాస్ రాజు, టీడీపీ నాయకులు మేడ విజయశేఖర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

"నాయకులు నాపై ఉంచిన విశ్వాసం, కార్యకర్తల అలుపెరగని శ్రమ వెలకట్టలేనివి. ఈ విజయాన్ని మండల ప్రజలకు, కార్యకర్తలకే అంకితం ఇస్తున్నా" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లోనే ఉంటానని ఆమె తేల్చిచెప్పారు.

కుట్రలను బద్దలు కొట్టిన 'సింగిల్' సింహం చిట్వేలీ జడ్పీటీసీగా గుత్తి నరసింహ సంచలన విజయం

రాజుకుంట నుంచి చిట్వేలు జడ్పీటీసీ పీఠం వరకు...గుత్తి నరసింహ రాజకీయ ప్రయాణం

సేవకు పట్టం కట్టిన చిట్వేలు ఓటర్లు..స్వతంత్ర అభ్యర్థిగా సత్తా చాటిన నిబద్ధత గల నాయకుడు

చిట్వేలి ప్రజలకు గుత్తి నరసింహ అందించిన దీపావళి చారిత్రాత్మక విజయం



చిట్వేలి నవంబర్ 9 మనం న్యూస్: రాజకీయాల్లో నాయకులు పుట్టుకొస్తారు... కానీ ప్రజల గుండెల్లో కొలువుండే నాయకులు కొందరే ఉంటారు. అధికారం, పదవులు ఉంటేనే సేవ చేయగలమని భావించే రోజుల్లో తన మంచితనం, నిబద్ధత, నిరంతర సేవా గుణంతోనే ప్రజాదరణ పొందిన నాయకుడు గుత్తి నరసింహ. అన్న అని తలుపు తడితే కాదనక ఆదుకునే ఉదార స్వభావం, ఊరి అభివృద్ధికి తపించే ఆరాటం ఆయనను ఈ రోజు చిట్వేలు మండలంలో ఒక తిరుగులేని శక్తిగా నిల బెట్టాయి. బడా నాయకుల కుట్రలు, కుటిల రాజకీయాలు, సొంత కూటమిలోని వెన్నుపోట్లను తట్టుకుని, 'సింహం సింగిల్‌గా వస్తుంది' అనే సామెతను నిజం చేస్తూ స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ పీఠాన్ని కైవసం చేసుకున్న ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

మారుమూల గ్రామం నుండి మచ్చలేని నాయకుడిగా...

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేలు మండలం, రాజుకుంట ఒక మారుమూల గ్రామం. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, మంచితనం, విలువలతో పెరిగిన గుత్తి నరసింహకు చిన్ననాటి నుంచే గ్రామంపై, ఊరి ప్రజలపై ప్రత్యేకమైన అభిమానం ఉండేది. విద్యను అభ్యసించి వ్యాపార రంగానికి వెళ్లినా, తన కంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశయంతో సమీప బంధువు, ప్రాణస్నేహితుడైన నానబాల నాగార్జునతో కలిసి రైల్వే కాంట్రాక్టర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు.

అయితే కాంట్రాక్ట్‌లు చేయడం ద్వారా వచ్చే ఆదాయం కంటే, ఊరిని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా భావించారు. ఈ క్రమంలోనే 2021లో నానబాల నాగార్జున ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీటీసీగా గెలవడం, అదే బాటలో గుత్తి నరసింహ రాజుకుంట గ్రామ సర్పంచ్‌గా స్వతంత్ర అభ్యర్థిగా ఘనవిజయం సాధించడం స్థానిక రాజకీయాల్లో పెద్ద సంచలనంగా మారింది. సర్పంచ్‌గా ఊరి రూపురేఖలు మారుస్తూ, ప్రజల్లో చెరగని ముద్ర వేశారు.

2024 ఎన్నికల్లో కీలక పాత్ర... కూటమిలో ప్రత్యేక స్థానం

తన సేవా కార్యక్రమాలు, రాజకీయ వ్యూహాలతో 2024 శాసనసభ ఎన్నికల్లో రైల్వే కోడూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ ఘనవిజయం సాధించడం లో గుత్తి నరసింహ అత్యంత కీలక పాత్ర పోషించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకుని, మండలంలో పార్టీ బలోపేతానికి రాత్రింబవళ్లు కష్టపడ్డారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, కార్యకర్తలకు కొండంత అండగా నిలిచారు.

కుటిల రాజకీయాల వెన్నుపోటు... తిరగబడిన అభిమాన గణం

ఇటీవల (2026) జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో చిట్వేలు మండలం నుంచి టిడిపి తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా గుత్తి నరసింహ నిలబడతారని, ఆయనకే టికెట్ వస్తుందని మండల ప్రజలంతా భావించారు. చిట్వేలు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే ఆశలతో ఉన్న నరసింహకు, కూటమిలోని కొందరు స్థానిక నాయకులు చేసిన కుటిల రాజకీయాలు, అంతర్గత కుట్రల వల్ల చుక్కెదురైంది. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడికి అర్ధాంతరంగా బీ-ఫామ్ నిరాకరించడం మండలంలో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. కానీ, నరసింహ నమ్ముకున్నది నాయకులను కాదు,ప్రజలను! "నీకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకూడదు, నీ సత్తా ఏంటో ఓటుతో చూపించాలి" అంటూ ఆయన అభిమానులు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారు. అభిమానుల కోరిక మేరకు, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి గుత్తి నరసింహ స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ బరిలోకి దిగారు.

ఒంటరి పోరు..600 పైచిలుకు మెజారిటీతో చారిత్రాత్మక విజయం

ఈ ఎన్నికల సమరం సామాన్యమైనది కాదు. ఒకవైపు అధికార కూటమిలోని బడా నాయకుల కుట్రలు, రాజకీయ ఒత్తిళ్లు... మరొకవైపు బలమైన ఓటు బ్యాంకు ఉన్న ప్రత్యర్థి పార్టీ వైకాపా వ్యూహాలు. ఎటు చూసినా సవాళ్లు, ప్రతిబంధకాలు. కానీ, నరసింహ ధైర్యం సడలలేదు. తన భుజస్కంధాలపై మండల ప్రజల నమ్మకాన్ని మోస్తూ ప్రచారంలో దూసుకుపోయారు. నరసింహ చేసిన సేవా కార్యక్రమాలు, ఆయన మంచితనం, ప్రజాదరణే ఆయనకు ఆయుధాలుగా మారాయి. ఎన్నికల ఫలితాలు రాగానే చిట్వేలు మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అన్ని రాజకీయ పార్టీల లెక్కలను తలకిందులు చేస్తూ, 600 పైచిలుకు ఓట్ల భారీ మెజారిటీతో గుత్తి నరసింహ ఘన విజయం సాధించి చిట్వేలు జడ్పీటీసీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

చిట్వేలు ప్రజలకు దీపావళి కానుక

గుత్తి నరసింహ సాధించిన ఈ విజయం కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, అది చిట్వేలు మండల ప్రజల గెలుపు, మంచితనానికి దక్కిన విజయం. కుట్రలు, కుతంత్రాలపై ప్రజాస్వామ్యం సాధించిన గెలుపు. ఈ విజయాన్ని చిట్వేలు మండల ప్రజలకు ముందస్తు దీపావళి కానుక గా ఆయన అభిమానులు భావిస్తున్నారు. సింహం వేటకు రావడానికి గుంపు అక్కర్లేదు ఒక్కటిగా వచ్చినా విజయం సాధిస్తుంది అనే నానుడికి గుత్తి నరసింహ నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని చిట్వేలు ప్రజలు కాలరెగరేసి మరీ చెబుతున్నారు. అన్యాయాన్ని ఎదురించి సాధించిన ఈ విజయం ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక మైలురాయి. రాబోయే రోజుల్లో గుత్తి నరసింహ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, ఆయన నాయకత్వంలో చిట్వేలు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మండల గ్రామీణ ప్రజలు, అభిమానులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

అర్హులైన వారు నమోదు పత్రాలు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి



కడప, మనం ప్రతినిధి నవంబర్ 9: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు చేరని అర్హులైన వారికి.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గైర్హాజరు, నివాసం మారడం, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి కారణాలతో ఓటరు జాబితాలో పేరు చేరని వారి వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, పురపాలక కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటు లో ఉంచాలని సూచించారు. సంబంధిత ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు నమోదు పత్రాలను అందజేస్తారని, అందుబాటులో ఉన్న ఫోన్ నంబర్లకు వాట్సాప్, సందేశాల ద్వారా కూడా పంపిస్తారని తెలిపారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు సంఖ్యతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా నమోదు పత్రాలను పొందవచ్చని వివరించారు. ఇంతకుముందు నివాసం మారని వారు నమోదు పత్రంతో పాటు, గతంలో ఎందుకు సమర్పించలేకపోయారో తెలియజేస్తూ అనుబంధం-బి ప్రకటనను అందజేయాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు కొత్త చిరునామా వివరాలతో అనుబంధం-సి ప్రకటనను జతచేసి సమర్పించాలి. వీరు ప్రత్యేకంగా ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. చిరునామా ఆధార పత్రాలు లేని నిరాశ్రయులకు బూత్ స్థాయి అధికారి పరిశీలన నివేదిక ఆధారంగా నివాస ధ్రువీకరణ కల్పిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ నమోదు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేరుస్తారని తెలిపారు. గతంలో ఉన్న ఓటరు గుర్తింపు సంఖ్యనే తిరిగి కేటాయిస్తారని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో పేరు చేర్చుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నిరాశ్రయులు, ఇతర కారణాలతో అందుబాటులో లేని ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదే సమయంలో ఒకరి పేరు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఈ ప్రక్రియను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేసి, నవంబర్ 22వ తేదీలోగా నివేదిక పంపాలని అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు


ప్రజా సమస్యల పరిష్కారమే ముఖాముఖి లక్ష్యం:మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



ప్రొద్దుటూరు, నవంబర్ 9, మనం న్యూస్ : ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో కమిషనర్ తో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన "కమిషనర్‌తో ముఖాముఖి" కార్యక్రమంలో పట్టణ ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు త్వరిత గతిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా వైఎంఆర్ కాలనీలోని రాజరాజేశ్వరి దేవాలయం వద్ద రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు వీధి దీపం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని బ్యాంక్ వీధి నందు తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నందు ఉన్న మహిళల జిమ్‌లో పాడైన పరికరాలకు మరమ్మతులు చేయించి వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్ వద్ద కొత్త మురుగునీటి కాలువలు నిర్మించాలని, వర్షం పడినప్పుడు వర్షపు నీరు రోడ్డుపైకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారన్నారు. ప్రజా సమస్యలను స్వీకరించిన కమిషనర్ సున్నంగా పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. సమస్యల స్వభావాన్ని బట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రతి సోమవారం నిర్వహించే కమిషనర్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సిటీ కృష్ణ సింగ్ మున్సిపల్ ఇంజనీర్ ఎం రాజేష్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యశోద తదితరులు పాల్గొన్నారు.

కౌంట్‌డౌన్ స్టార్ట్ నవంబర్ 26న కోడూరు నియోజకవర్గ పంచాయతీ ఎన్నికలు - 15న నోటిఫికేషన్!

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైన కోడూరు బెల్ట్: నవంబర్ 26న పోలింగ్, అదే రోజు ఫలితాలు!



రైల్వే కోడూరు, నవంబర్ 09, మనం న్యూస్ : తిరుపతి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల శంఖారావం పూరించింది. జిల్లావ్యాప్తంగా రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేయగా, అందులో భాగంగా రైల్వే కోడూరు, చిట్వేల్, పెనగలూరు, ఓబులవారిపల్లి మరియు పుల్లంపేట మండలాల్లో మొదటి విడతలోనే పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్.వేంకటేశ్వర్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఐదు మండలాల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల స్థానాలకు సమరం కాకరేపనుంది. మొదటి విడత ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు ఈ నెల 15వ తేదీ (ఆదివారం) ప్రకటన జారీ చేయనున్నారు. నోటీసు వెలువడిన వెంటనే నామినేషన్ల పర్వం షురూ కానుంది. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులకు నవంబర్ 17 (మంగళవారం) వరకు గడువు ఇవ్వగా, 18వ తేదీన అధికారుల సమక్షంలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేస్తారు. తిరస్కరించబడిన నామినేషన్లపై నవంబర్ 19న అప్పీలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అనంతరం నవంబర్ 20న ఆ అప్పీళ్లను అధికారులు పరిష్కరిస్తారు. ఇక పోటీలో నిలవాలనుకునే అభ్యర్థుల తుది నిర్ణయానికి నవంబర్ 21 (శనివారం) చివరి రోజు కానుంది. అదే రోజు మధ్యాహ్నం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన వెంటనే, పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు. అభ్యర్థుల ప్రచారం ముగిసిన పిమ్మట నవంబర్ 26 (గురువారం) ఉదయం నుంచే పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రానికి ఓట్ల లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటిస్తారు. ఏవైనా సాంకేతిక, ఇతర కారణాల వల్ల పోలింగ్‌కు అంతరాయం కలిగితే అవసరమైన చోట నవంబర్ 27న రీ-పోలింగ్ నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. స్థానిక పోరుకు సమయం దగ్గరపడటంతో రైల్వే కోడూరు, చిట్వేల్, పెనగలూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గ్రామాల్లో ఓటర్లు మరియు అభ్యర్థులు ఇప్పటి నుంచే సమాయత్తమవుతున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

న్యాయవాది వి.రాఘవేంద్రరావుకు ఉత్తమ సేవా పురస్కారం



న్యాయసేవా సదన్ తరపున ప్రశంసాపత్రం అందజేత

ఒంటిమిట్ట నవంబర్ 9 (మనం న్యూస్): న్యాయం కోసం కోర్టుల గడప తొక్కే నిరుపేదలు, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ విశేష సేవలందిస్తున్న సీనియర్ న్యాయవాది, జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) న్యాయసేవా సదన్ ప్యానెల్ న్యాయవాది వి.రాఘవేంద్రరావుకు ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. న్యాయరంగంలో ఆయన నిరంతరం అందిస్తున్న ఉత్తమ సేవలను పరిగణనలోకి తీసుకుని, సోమవారం న్యాయసేవా సదన్ తరపున ఆయనకు ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు.

పేదల పక్షపాతిగా ప్రత్యేక గుర్తింపు

సమాజంలో ఆర్థిక స్తోమత లేక, న్యాయవాదుల ఫీజులు భరించలేక సతమతమయ్యే పేదలకు, అట్టడుగు వర్గాలకు ఉచితంగా న్యాయసహాయం అందించడంలో వి.రాఘవేంద్రరావు అంకితభావంతో పనిచేస్తున్నారు. న్యాయసేవాధికార సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా, చట్టపరమైన సేవలను గ్రామీణ ప్రాంతాలు, సామాన్య ప్రజల ముంగిటకు తీసుకెళ్లడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ముఖ్యంగా వివిధ న్యాయ విజ్ఞాన సదస్సుల్లో పాల్గొంటూ చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం

డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు సంక్లిష్టమైన కేసుల్లో బాధితుల పక్షాన నిలబడి, వారికి త్వరితగతిన న్యాయం చేకూరేలా ఆయన చిత్తశుద్ధితో వ్యవహరించారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా పలు వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించడంలోనూ తనవంతు పాత్ర పోషించారు. ఆయన నిబద్ధత, సేవాతత్పరతను గుర్తించిన అధికారులు ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వెల్లువెత్తిన అభినందనలు:

వి.రాఘవేంద్రరావుకు ఉత్తమ సేవా ప్రశంసాపత్రం లభించడం పట్ల కడప బార్ అసోసియేషన్ సభ్యులు, తోటి న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆయన పేదలకు మరింత అండగా నిలుస్తూ ఆదర్శప్రాయమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

శ్రీవారి భక్తులకు శుభవార్త.. ఆన్‌లైన్‌లో టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీల బుకింగ్ ప్రారంభం

టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 2027 డైరీలు, క్యాలెండర్ల ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం

తిరుమల, తిరుపతి, తిరుచానూరులోని 12 కౌంటర్లలోనూ అందుబాటులో ప్రచురణలు

హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ సహా ప్రధాన నగరాల్లోని టీటీడీ కేంద్రాల్లో విక్రయాలు

గత సెప్టెంబరు 7న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ

భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీటీడీ ప్రజాసంబంధాల విభాగం విజ్ఞప్తి



తిరుమల, (మనంన్యూస్): రాబోయే నూతన సంవత్సరం 2027ను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఏటా విశేష ఆదరణ పొందే టీటీడీ డైరీలు, క్యాలెండర్లను భక్తులు ఈసారి తమ ఇళ్ల నుంచే సులభంగా పొందేలా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించింది. శ్రీవారి భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారా 2027 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను నేరుగా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చని దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్ సదుపాయంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యక్ష విక్రయ కేంద్రాలను కూడా టీటీడీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచింది. తిరుపతి, తిరుమల, తిరుచానూరు పరిధిలోని టీటీడీ ప్రచురణల విక్రయ విభాగానికి చెందిన 12 ప్రత్యేక కౌంటర్లలో వీటిని భక్తులు కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లోని భక్తుల కోసం స్థానిక టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ వీటి విక్రయాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ కేంద్రాలతో పాటు విజయవాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై నగరాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో ఈ క్యాలెండర్లు, డైరీలు లభ్యమవుతున్నాయి. కాగా, 2027 నూతన సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను 2026 సెప్టెంబరు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఆవిష్కరణ జరిగిన నాటి నుంచే ప్రత్యక్ష కేంద్రాల్లో వీటి విక్రయాలు వేగంగా సాగుతున్నాయి. భక్తుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని సైతం విస్తృతం చేశారు. శ్రీవారి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని లేదా సమీపంలోని సమాచార కేంద్రాల వద్ద వీటిని కొనుగోలు చేయాలని టీటీడీ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



బెంగాల్‌లో వింత ఘటన..

ఎన్‌క్లోజర్ కింద సొరంగం తవ్వి పారిపోయిన ఆడపులి

బుక్సా టైగర్ రిజర్వ్‌లో ఎన్‌క్లోజర్ కింద సొరంగం తవ్వి తప్పించుకున్న ఆడపులి

అసోం నుంచి బంధించి తీసుకొచ్చిన నాలుగు రోజులకే మళ్లీ పరార్

బాలా నదిని దాటి తూర్పు వైపు అసోం దిశగా వెళ్తున్నట్లు గుర్తింపు

పులులు సాధారణంగా గుంతలు తవ్వవని..

ఎన్‌క్లోజర్ భద్రతపై నిపుణుల ప్రశ్నలు

వరుసగా ఎన్‌క్లోజర్ దాటుతుండటంతో అటవీ శాఖ అధికారుల్లో తీవ్ర ఆందోళన

పశ్చిమ బెంగాల్‌లోని బుక్సా టైగర్ రిజర్వ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్ పునాది కింద సొరంగం తవ్వి మూడేళ్ల ఆడపులి చాకచక్యంగా తప్పించుకుంది. అసోం నుంచి తిరిగి తీసుకొచ్చిన కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడంతో అటవీ అధికారులు విస్మయానికి గురయ్యారు. బెంగాల్‌లో పులుల సంఖ్యను పెంచే ప్రాజెక్టులో భాగంగా బీహార్‌లోని వాల్మీకి టైగర్ రిజర్వ్ నుంచి 'టీ-138' (బీటీఆర్-టీఎఫ్1) అనే ఆడపులిని తీసుకొచ్చారు. అక్టోబర్ 2న బుక్సాలోని 25వ మైలు వద్ద ఉన్న 2.2 హెక్టార్ల ఎన్‌క్లోజర్‌లో దీనిని విడిచిపెట్టగా, అక్టోబర్ 4నే బయటపడి సంకోష్ నది దాటి అసోంలోని రైమోనా ప్రాంతానికి వెళ్లిపోయింది. అనేక రోజులు శ్రమించి, చివరకు నవంబర్ 3న మత్తుమందు ఇచ్చి పట్టుకుని మళ్లీ బుక్సా ఎన్‌క్లోజర్‌కు చేర్చారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆ పులి ఎన్‌క్లోజర్ ఫెన్సింగ్ పునాది కింద మట్టిని సొరంగంలా తవ్వి బయటకు జారుకుంది. ప్రస్తుతం అది బాలా నదిని దాటి తూర్పు వైపుగా అసోం దిశగా వెళ్తున్నట్లు తెలిసింది. గతంలో వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తే జయంతి, రైడక్, సంకోష్ నదులను దాటి అసోం లేదా భూటాన్ అడవుల్లోకి ప్రవేశించే అవకాశముంది. సాధారణంగా కుక్కలు లేదా హైనాల మాదిరిగా పులులు నేలను లోతుగా తవ్వలేవని, ఎన్‌క్లోజర్ పునాది పటిష్ఠంగా నిర్మించి ఉంటే ఇలా జరిగేది కాదని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా మాజీ శాస్త్రవేత్త ఒకరు అభిప్రాయపడ్డారు. దీంతో ఈ ఎన్‌క్లోజర్ నిర్మాణ నాణ్యత, భద్రతా లోపాలపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

స్నేహితురాలి బాధతో స్ఫూర్తి.. రుతుక్రమ సమస్యలపై పోరాటం..

ఢిల్లీ విద్యార్థికి డయానా అవార్డు

రుతుక్రమ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఢిల్లీవిద్యార్థి ఆద్విక్ జైన్

'టీమ్ పీరియడ్' పేరుతో చేపట్టిన కార్యక్రమాలకు ప్రతిష్ఠాత్మక డయానా అవార్డు 2026

స్నేహితురాలి అనారోగ్య సమస్యతో స్ఫూర్తి పొంది ఈ కార్యక్రమం ప్రారంభం

పాఠశాలల్లో వర్క్‌షాప్‌లు, శానిటరీ ప్యాడ్ డిస్పెన్సర్ల ఏర్పాటు

ప్రపంచవ్యాప్తంగా 198 మంది విజేతల్లో భారత్ నుంచి 49 మంది



ఢిల్లీకి చెందిన 18 ఏళ్ల విద్యార్థి ఆద్విక్ జైన్, సామాజిక సేవలో యువతకు అందించే ప్రతిష్ఠాత్మక 'డయానా అవార్డు-2026'ను గెలుచుకున్నాడు. రుతుక్రమ ఆరోగ్యంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, శానిటరీ ఉత్పత్తుల లభ్యతను మెరుగుపరిచేందుకు ఆద్విక్ స్థాపించిన 'టీమ్ పీరియడ్' అనే సంస్థకు ఈ అంతర్జాతీయ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వెనుక ఓ బలమైన కారణం ఉంది. 2023లో ఆద్విక్‌కు 14 ఏళ్ల వయసున్నప్పుడు, తన స్నేహితురాలు ఒకరు పాఠశాల పరీక్షల సమయంలో తీవ్రమైన రుతుక్రమ నొప్పితో బాధపడటం అతడిని తీవ్రంగా కదిలించింది. పరీక్షలు ఎగ్గొట్టేందుకే అలా నటిస్తోందని మొదట ఆమె కుటుంబ సభ్యులు కొట్టిపారేశారు. కానీ, ఆ తర్వాత వైద్య పరీక్షల్లో ఆమెకు పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ సంఘటనతో రుతుక్రమ సమస్యలపై బహిరంగ చర్చ, అవగాహన ఎంత అవసరమో ఆద్విక్ గుర్తించాడు. ఈ స్ఫూర్తితో 2024లో తన స్నేహితులు శివాన్ష్ అరోరా, ఆరాత్రిక ఝా ఆనంద్, నవ్య మంగ్లిక్‌లతో కలిసి 'టీమ్ పీరియడ్'ను ప్రారంభించారు. ఈ బృందం ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలలు, వెనుకబడిన ప్రాంతాల్లో వర్క్‌షాప్‌లు, ఆరోగ్య శిబిరాలు, వీధి నాటకాలు, ఫ్లాష్ మాబ్‌లు నిర్వహించింది. నెలసరి మరకల పట్ల ఉన్న భయాన్ని, చిన్నచూపును తొలగించేందుకు యూనిఫామ్‌లపై ఎర్రటి ప్యాచ్‌లు ధరించే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. అంతేకాకుండా ఆద్విక్ తన పాఠశాలలో ఒక శానిటరీ ప్యాడ్ డిస్పెన్సర్‌ను ఏర్పాటు చేశాడు. ఇప్పటివరకు దాదాపు 4,000 మంది నుంచి సర్వేల ద్వారా సమాచారం సేకరించారు. ఈ ఏడాది నవంబర్ 4న ప్రకటించిన ఈ అవార్డుకు ప్రపంచవ్యాప్తంగా 44 దేశాల నుంచి 198 మంది యువతీ యువకులు ఎంపిక కాగా, వారిలో భారత్ నుంచి 49 మంది ఉండటం విశేషం. 16 నుంచి 25 ఏళ్ల వయసులో సామాజిక సేవ చేసే యువతను ఈ పురస్కారంతో గౌరవిస్తారు. ఆద్విక్ జైన్.. 2027 ఫిబ్రవరి నుంచి ఇటలీలోని బోలోగ్నా విశ్వవిద్యాలయంలో మెడిసిన్, పబ్లిక్ హెల్త్ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. భవిష్యత్తులో స్థానిక చాప్టర్ల ద్వారా 'టీమ్ పీరియడ్' కార్యకలాపాలను మరింత విస్తరించాలని భావిస్తున్నాడు.